క్లుప్తంగా

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కొవ్వూరు: రోడ్డు నిర్మాణంలో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మునిసిపల్ చైర్పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. పట్టణంలో మెయిన్ రోడ్డులో విజయ విహార్ సెంటర్ నుంచి హెడీఎఫ్‌సీ బ్యాంకు వరకూ నిర్మిస్తున్న తారు నిర్మాణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పదిహేనో ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షల వ్యయంతో 350 మీటర్ల పొడవునా ఈ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆమె తెలిపారు. కమిషనర్ బి. శ్రీకాంత్, ఏఈ కె.సుశాంత్ తదితరుల ఆమె వెంట ఉన్నారు.

45 మందికి కంటి పరీక్షలు

ఉండ్రాజవరం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో దమ్మెన్ను గ్రామంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ ప్రారంభించారు. శిబిరంలో 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు నేత్ర వైద్యుడు టి.రాంబాబు తెలిపారు. పది మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఒకరికి ఆపరేషన్ సూచించినట్లు ఆయన చెప్పారు. మిగిలిన వారికి మందులు, ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌ఓ ఎం.రమ్య, ఏఎన్ఎం నాగమణి, సీతయ్య, ఆశాలు పాల్గొన్నారు.

అదృశ్యమైన ఆరు గంటల్లోనే బాలిక ఆచూకీ గుర్తింపు

దిశ యాప్ ఎఫెక్ట్

నిడదవోలు: తమ కుమార్తె కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు మంగళవారం దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కొన్ని గంటల వ్యవధిలోనే ఆ బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలిక కుటుంబ సభ్యులను, స్థానికులను విచారించగా ఏసేబు అనే యువకుడితో ఆమె వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసిన పట్టణ ఎస్సై పి.నాగరాజు టెక్నికల్ ఎవిడెన్స్,సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా బాలిక ఎక్కడుందో గుర్తించారు. కేవలం ఆరు గంటల వ్యవధిలోనే బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాలికను తీసుకెళ్లిన యువకుడిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసిన వెంటనే తక్షణం స్పందించి తమ కుమార్తెను క్షేమంగా అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషికాలు

కొవ్వూరు: ప్రతిభ కనబరుస్తున్న స్థానిక సంస్కృత పాఠశాల విద్యార్థులకు మంగళవారం మోటుమర్రి పద్మనాభం, మంగరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఎంఏఎస్ మురళీకృష్ణ నగదు పారితోషికాలు అందజేశారు. ఆ పాఠశాలకు చెందిన ఎం.శిరీష, అరుణతేజ, సంధ్యాలక్ష్మి,హేమంత్‌కుమార్, కోమిరి గీతికలు ఈ అవార్డులు స్వీకరించారు. అలాగే షిర్డీ సాయిట్రస్టు తరపున కసిరెడ్డి సీతారామయ్య విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశా.రిటైర్డ్ హెచ్‌వోడీ ఈమని దక్షిణామూర్తి, హెచ్ఎం గోవర్ధనం శ్రీనివాసమూర్తి, దోర్బల ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

'ఉపా' చట్టం రద్దుకు వినతి

కొవ్వూరు: ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (ఉపా)రద్దు చేయాలని కోరుతూ పౌరహక్కుల సంఘం, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, పీకేఎస్, భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీవోడబ్ల్యూ నాయకులు స్థానిక ఆర్డీవో కార్యాలయ ఏవో బాజీరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

రామానంద భారతీజీ వర్ధంతి

నల్లజర్ల: అనంతపల్లిలోని స్వర్ణ దుర్గాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడైన రామానంద భారతీజీ 8వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. భారతీస్వామి విగ్రహం వద్ద అద్దంకి కృష్ణమోహన్, స్వరూప దంపతులు పాదపూజ చేశారు. ప్రసన్న విఘ్నేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో సంకీర్తన, అన్నదానం జరిగాయి.

బీమా తక్షణ సాయం అందజేత

నల్లజర్ల: నల్లజర్లలో ఇటీవల గుండె వ్యాధితో మృతిచెందిన నక్కా బులి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను సచివాలయం-2 కార్యదర్శి చారి అందజేశారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

సేవామూర్తులు.. వలంటీర్లు

- సంక్షేమ పథకాలను ఇళ్లకు చేరవేస్తున్న వారధులు
- కరోనా విపత్తు వేళ ప్రాణాలకు తెగించి సేవలు
- ఆసుపత్రులకు వెళ్లి మరీ పింఛన్ల అందజేత

కొవ్వూరు/పెరవలి/నిడదవోలు రూరల్/తాళ్లపూడి/దేవరపల్లి/చాగల్లు: వలంటీర్ వ్యవస్థ అనేది సేవకు పర్యాయ పదంగా మారింది. వలంటీర్ల సేవలను మన రాష్ట్రం మాత్రమే కాదు.. దేశం మొత్తం కొనియాడుతోంది. కరోనా విపత్తు వేళ వలంటీర్ వ్యవస్థ లేకుంటే ఎంతోమంది ప్రాణాలు గాల్లో కలిసిపోయి ఉండేవి. కరోనా సోకిన వారిని కుటుంబ సభ్యులు విస్మరించినా తామున్నామంటూ వలంటీర్లు నిషేధిత ప్రాంతాలకు వెళ్లి మందులు, పౌష్టికాహారం అందించి ఎంతోమంది ఊపిరి నిలిపారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వలంటీర్లు ప్రతి కుటుంబ వ్యక్తిగత వివరాల సేకరించి, వారికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేస్తున్నారు. అంతేగాకుండా వారి చేత దరఖాస్తు చేయించి పథకాల లబ్ధిని చేరవేస్తున్నారు. మన వీధికి ఏ సమయంలో రేషన్ వాహనం వస్తుందో ముందుగానే సమాచారం ఇస్తున్నారు. బీమా పథకంలో అర్హులను చేర్పించి, వారి కుటుంబాల్లో భద్రత నింపే బాధ్యతను కూడా వలంటీర్ల తీసుకుంటున్నారు. కుల,ఆదాయం, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజీ వంటి సర్టిఫికెట్లను ఇంటికే అందిస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇప్పించడం, ఆధార్ కార్డుల్లో మార్పులు చేయించడం, ఇళ్లు లేని పేదలను గుర్తించి, పక్కాగృహాలకు దరఖాస్తు చేయిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛనుదారులకు ఇళ్లకు, అవసరమైతే పొరుగూర్లకు వెళ్లి పింఛను సొమ్ము అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందే రాయితీలను తెలియజేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఇటీవల ఒడిశా ఘోర రైలు ప్రమాదంలో చిక్కుకున్న మన ప్రాంత వాసుల వివరాలు అధికారుల ద్వారా సేకరించి వారి కుటుంబ సభ్యులకు అందించడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. అందుకే వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా వారికి పురస్కారాలు అందించి గౌరవిస్తోంది. వలంటీర్లు అందిస్తున్న సేవలు..చేకూరిన లబ్ధి ప్రజల మాటల్లోనే..

15 ఏళ్ల తర్వాత రేషన్, ఆధార్ కార్డులు



భర్త వదిలేశాడు. పేద కుటుంబం. వినికిడి సమస్య ఉంది. కుమార్తె ఒక్కతే సంతానం. వివాహం కావడంతో అత్తవారింటికి వెళ్లిపోయింది. రేషన్ కార్డు ఇప్పించమని 15 ఏళ్లుగా ఎందరో నాయకులను, అధికారులను బ్రతిమలాడినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని కలిసి పరిస్థితిని వివరించాను. నాకు ఆధార్ కార్డు కూడా లేదు. నా పరిస్థితి చూసి జాలిపడిన ఎమ్మెల్యే అధికారుల ద్వారా ఆ రెండు కార్డులు ఇప్పించే బాధ్యత మా వలంటీర్ చిటికెన దుర్గాభవానికి అప్పగించారు. మా వలంటీర్ నన్ను వెంటబెట్టుకుని నిడదవోలు తీసుకువెళ్లి ఐరిష్, వేలిముద్రలు సేకరించి ఆధార్ కార్డు పొందేలా చేసింది. అక్కడితో ఊరుకోకుండా 'జగనన్న సురక్ష'లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయించింది. వెంటనే రేషన్‌కార్డు కూడా మంజూరైంది. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ నాకు కార్డు ఇచ్చారు. వలంటీర్ దుర్గాభవానికి ధన్యవాదాలు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి, జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– చెక్కా ధనలక్ష్మి, ఉసులుమర్రు, పెరవలి మండలం

వలంటీర్ వల్లే మా పాపకు వైద్యం



మా రెండేళ్ల కుమార్తె చెట్టే డయానా శాంతి 'స్పైనల్ మాస్క్యులర్' అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి రూ.16 కోట్లు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. మాది పేద కుటుంబం. మా కుటుంబం, మా వలంటీర్ యల్లమెల్లి ప్రియాంక ఈ ఏడాది జనవరి 3న రాజమహేంద్రవరం వచ్చిన సీఎం జగనన్న వద్దకు వెళ్లి పాప వ్యాధి గురించి చెప్పాం. వెంటనే పాపకు నెలకు రూ.5 వేల పింఛను మంజూరు చేశారు. నాకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చారు.వైద్యానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం జగనన్న మంజూరు చేశారు. పాపకు ఏ హాస్పిటల్‌లో వైద్యం చేయిస్తున్నా అక్కడకు ప్రతినెల స్వయంగా మా వలంటీర్ ప్రియాంక వచ్చి పింఛను అందిస్తోంది. పాప వైద్యానికి ఆర్థిక సాయం కోసం కలెక్టర్, వివిధ ఉన్నతాధికారుల వద్దకు వలంటీర్ నన్ను తీసుకు వెళ్లింది. ఇప్పుడు మా పాపకు మంచి వైద్యం అందేలా చూడడంలో వలంటీర్ ప్రియాంక సహకారం ఎనలేనిది.

– చెట్టే సూర్యకుమారి, శెట్టిపేట, నిడదవోలు మండలం

సమాచారం ఇస్తున్నారు .. లబ్ధి చేకూరుతోంది



ప్రభుత్వ పథకాలు, రాయితీలకు సంబంధించిన సమాచారాన్ని మా వలంటీర్ కె.అశోక్ ఎప్పటికప్పుడు మా కుటుంబానికి వివరిస్తున్నారు. వాటి ద్వారా మాకు లబ్ధి చేకూరుస్తున్నారు. నా భర్తకు డయాలసిస్ పింఛను నెలకు రూ.10 వేలు, వైఎస్సార్ కాపు నేస్తం కింద నాకు ఏడాదికి రూ.15 వేలు అందుతున్నాయి. మా కుమార్తె చదువుకు జగనన్న విద్యాదీవెన పథకంలో ఏడాదికి రూ.15 వేలు, వైఎస్సార్ ఆసరాలో భాగంగా ఏడాదికి రూ.7 వేలు ఇస్తున్నారు. జగనన్న తోడులో వడ్డీ లేని రుణం లభిస్తోంది. ఇవన్నీ మాకు లభించడం వల్ల వలంటీర్ కె.అశోక్ తోడ్పాటు ఎంతో ఉంది.

– కంబాల సరిత, బ్రాహ్మణగూడెం,చాగల్లు మండలం

పథకాలు అందుతున్నాయి



గతంలో ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి మాకు తెలిసేది కాదు. వాస్తవానికి చాలా పథకాలకు మేం అర్హులమై ఉండి కూడా లబ్ధి పొందలేకపోయాం. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ఆ సమస్య తీరింది. మా వలంటీర్ పేరు గుల్లి ఉదయభాను. ఎప్పుడు ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలో మా ఇంటికి వచ్చి చెబుతారు. ఆమె దగ్గర ఉండి దరఖాస్తు చేయించి తీసుకువెళ్లి, మంజూరు చేయిస్తారు. ఈ నాలుగేళ్లలో రైతు భరోసా, పంటల బీమా, వైఎస్సార్ ఆసరా, పిల్లలకు విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా మా బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ అవుతున్నాయి. ఇందులో వలంటీర్ ఉదయభాను సాయం ఎంతో ఉంది.

– ముళ్ల చంద్ర, గృహిణి, ప్రక్కిలంక, తాళ్లపూడి మండలం

కొత్త పథకాల గురించి చెబుతుంటారు



మా వలంటీర్ పేరు చిట్టూరి నవీన్. నెలలో రెండు, మూడు సార్లు ఇంటికి వచ్చి యోగక్షేమాలు తెలుసుకుంటారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న పథకాల గురించి చెబుతుంటారు. వాటి గురించి అవగాహన కల్పిస్తారు. అయనే దగ్గర ఉండి దరఖాస్తు చేయిస్తారు. ఆయన సలహాల వల్ల వివిధ పథకాల ద్వారా మా కుటుంబానికి ఏడాదికి రూ.85 వేలు అందుతున్నాయి. వలంటీర్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– గోపనబోయిన వెంకటలక్ష్మి, దేవరపల్లి

పవన్‌పై వలంటీర్ల ఆగ్రహం



దేవరపల్లిలో నిరసన ర్యాలీ చేస్తున్న గ్రామ వలంటీర్లు



తూర్పుచోడవరంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

- దేవరపల్లిలో నిరసన
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత
- యర్నగూడెం బస్టాండ్ సెంటర్లో దిష్టిబొమ్మ దహనం

దేవరపల్లి: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, తమపై చేసిన వాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ వలంటీర్లు మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్, పవన్ కళ్యాణ్‌ను చెప్పుతో కొట్టాలి, పోలీస్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి అంటూ వారు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. వలంటీర్ల నినాదాలతో గ్రామాల్లోని ముఖ్యకూడలులు హోరెత్తాయి. దేవరపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తహసీల్దార్ ఎం.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామ వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యర్నగూడెం బస్టాండ్ వద్ద గ్రామ వలంటీర్లు ఆందోళన నిర్వహించి, పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

తూర్పు చోడవరంలో దిష్టిబొమ్మ దహనం

నల్లజర్ల: ఏలూరు బహిరంగ సభలో ఆదివారం రాత్రి పవన్ కల్యాణ్ తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వలంటీర్లు భగ్గుమన్నారు. మండలంలోని తూర్పు చోడవరంలోని అంబేద్కర్ సెంటర్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను మంగళవారం రాత్రి వారు దహనం చేశారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరవేస్తున్న తమను అమ్మాయిలను అపహరించే ముఠాలుగా పేర్కొనడమంటే వలంటీర్ల వ్యవస్థనే అవమానించడం అన్నారు. తమకు పవన్ కల్యాణ్ బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రోడ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఆదేశం
- ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: నియోజకవర్గంలో తలపెట్టిన ఆర్ అండ్ బీ రహదారుల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో చేపట్టే రహదారుల నిర్మాణాలపై నిడదవోలులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.10.40 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో కానూరు-ఉండ్రాజవరం, కానూరు-గోపవరం, తేతలి-మునిపల్లి, మోర్త-పెరవలి, వయాతాడిపర్రు, అజ్జరం ప్రధాన రహదారి పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ద్వారా నియోజకవర్గంలో 10 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ ఐ.దేవేంద్రరాజు, డీఈ డీవీ రమణ, పంచాయతీరాజ్ ఏఈ ఆగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు అండగా నిలవాలి

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సూచించారు. గృహ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్, ఎలక్ట్రికల్, మండల, మున్సిపల్ అధికారులతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, హౌసింగ్ డీఈ ఎస్.చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

31 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా మంగళవారం ఉండ్రాజవరం పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. తణుకు నిషా ఆసుపత్రి ప్రసూతి వైద్య నిపుణురాలు అయేషా బేగం 31 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఆందజేశారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్, పీహెచ్‌సీ రెండో వైద్యాధికారి ఉషాదేవి, సీహెచ్ఓ ఎం.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల పీహెచ్‌సీలో సుమారు 40 మందికి..

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీలో సుమారు 40 మంది గర్భిణులకు వైద్యాధికారి సిరాజుద్దీన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి స్కానింగ్ తీశారు.ఉచితంగా మందులు అందించారు. హైరిస్‌లో ఉన్నవారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ ప్రసాద్, పీహెచ్ఎన్ రాధాకుమారి, సూపర్‌వైజర్ ఝాన్సీ తదితరులు సేవలు అందించారు.

కంసాలిపాలెం చెరువులో విష ప్రయోగం

రూ. లక్షల విలువైన చేపలు మృతి



కంసాలిపాలెం చెర్వు వద్ద చనిపోయిన చేపలు

నిడదవోలు రూరల్: విష ప్రయోగం జరగడంతో ఓ చెరువులో పెంచుతున్న రూ.లక్షలాది విలువైన చేపలు చనిపోయి నీటిపై తేలాయి. ఈ ఘటన మండలంలోని కంసాలిపాలెం ఎస్సీ ఏరియాలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇక్కడ ఉన్న సుమారు మూడెకరాల విస్తీర్ణంలోని పంచాయతీ చెరువును రావిమెట్ల గ్రామానికి చెందిన మిద్దే శ్రీను అనే వ్యక్తి పది నెలల క్రితం లీజుకు తీసుకుని, అందులో చేపలు పెంచుతున్నాడు. మరికొన్ని రోజుల్లో ఆ చేపలను పట్టి విక్రయించుకోవాల్సి ఉంది. సోమవారం రాత్రి గడ్డి మందు కలవడంతో ఆ చెరువులో పెరుగుతున్న చేపలు మంగళవారం ఉదయం చనిపోయి నీటిపై తేలిపోయాయి. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చెర్వులో కలుపుమందు కలపడం వల్ల రూ.20 లక్షల విలువైన తన చేపలు చనిపోయాయని మిద్దే శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఓ చెట్టు విషయంలో ఆ వ్యక్తితో గతంలో గొడవ జరిగిందన్నారు. తనకు నష్టం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీను తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొవ్వూరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పెనకనమెట్ట గ్రామానికి చెందిన కొక్కిరిపాటి జీవరత్నం (28) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో సోమవారం రాత్రి మృతి చెందాడు. కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవరత్నం మద్యానికి బానిస అయ్యాడు. దాంతో అతడి ఆరోగ్యం దెబ్బతింది. కుటుంబ సభ్యులు ఇటీవల రాజమహేంద్రవరంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి జీవరత్నం ఈనెల 9వ తేదీ రాత్రి మళ్లీ ఫుల్‌గా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దాంతో భార్య ఆశాజ్యోతి గట్టిగా భర్తను ప్రశ్నించింది. కోపం వచ్చిన జీవరత్నం బయటికి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వత ఆశాజ్యోతి తోడికోడలైన మౌనికకు జీవరత్నం ఫోన్ చేసి తాను కలుపు మందు తాగినట్టు చెప్పాడు. దీంతో భార్య ఆశాజ్యోతి, ఆమె బావ, తోడికోడలు వెళ్లి జీవరత్నాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి రాజమహేంద్రవరం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి జీవరత్నం మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి సమాచారం అందిందని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఆశాజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సురక్షతో అన్ని వర్గాలకు మేలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పలుచోట్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ



మునిపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని మునిపల్లి, అట్లపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. మునిపల్లి కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 981 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతులకు సీసీఆర్‌సీలు, ఓటీఎస్ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ వెలగన నరేష్, తహసీల్దార్ ఎం.గంగరాజు, ఎంపీడీఓ పి.శామ్యేలు పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. 09, 10 వార్డుల ప్రజలకు 666 కుల, 901ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 27మంది ఆధార్‌ను మొబైల్‌తో అనుసంధానం చేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైఎస్ చైర్‌పర్సన్ గంగులు వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని ఉసులుమర్రు, పెరవలి గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. పెరవలిలో 987 మందికి, ఉసులుమర్రులో 1040 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా అందించారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చీర్ల రాధయ్య, తహసీల్దార్ టి.రాజ రాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ పాల్గొన్నారు.

తాళ్లపూడి: గజ్జరం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు చేతుల మీదుగా 675 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ గండి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, డీపీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: కలవలపల్లి సచివాలయం-1 వద్ద సర్పంచ్ ఆకుల లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్కూరి దొరయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ, ఎంపీడీవో బి.రాం ప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పసలపూడిలో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, తాడిపర్రులో తహసీల్దార్ జి.కనకరాజు అధ్యక్షతన శిబిరాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య చేతుల మీదుగా పలువురికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, సర్పంచ్‌లు కట్టా లక్ష్మి, కరుటూరి నరేంద్ర, ఎంపీటీసీ సభ్యులు కట్టా వెంకటేశ్వరరావు, కట్టా విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు చామర్తి తమ్మిరాజు పాల్గొన్నారు.